క్లుప్తంగా

జీఓ 3 పరిరక్షణకు గిరిజనులు ఉద్యమించాలి


మాట్లాడుతున్న శివనాయక్

టేకులపల్లి: జీఓ 3 పరిరక్షణ కోసం గిరిజనులు ఉద్యమ బాట పట్టాలని, హక్కుల సాధనకు కదిలి రావాలని సేవాలాల్ సేన జిల్లా కోకన్వీనర్ మాలోత్ శివనాయక్ పిలుపునిచ్చారు. టేకులపల్లిలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 6న టేకులపల్లిలో జరిగే మండలస్థాయి సదస్సు, సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో జరిగే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మండల అడ్‌హక్ కమిటీని ప్రకటించారు. మండల కన్వీనర్‌గా ఆంగోతు విజయ్‌కుమార్‌నాయక్, కోకన్వీనర్లుగా రాజ్‌కుమార్‌నాయక్, బాలకృష్ణనాయక్, జర్పుల ప్రసాద్‌నాయక్‌తో పాటు వివిధ పదవులకు భూక్యా సాయినాయక్, ధరావతు రాంవిలాస్, గుగులోతు సాయి, నర్సింగ్‌నాయక్, సురేశ్‌నాయక్, బానోతు వీరుక్, అజ్మీరా జానును ఎన్నుకున్నారు. సమావేశంలో ధరావత్ కృష్ణనాయక్, రాందాస్, ధరావత్ నాగేంద్ర, కోటి, రాము, విజయ్, వంశీ పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ సకాలంలో సెటిల్‌మెంట్ చేస్తాం..


సీఎంపీఎఫ్ వివరాలు అందిస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీఎం కార్యాలయంలో గురువారం సీఎంపీఎఫ్ ట్రైపార్టీయేట్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం, పెన్షన్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. సీఎంపీఎఫ్ కమిషనర్ ఎం.కనకమ్మ అధ్యక్షత వహించగా.. ఏరియా జీఎం శాలేంరాజు మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందినవారి సీఎంపీఎఫ్ సెటిల్మెంట్‌ను సకాలంలో అందిస్తామని తెలిపారు. పరిష్కారం కాని కేసులేమైనా ఉంటే నేరుగా సీఎంపీఎఫ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎండీ రజాక్, మల్లికార్జున్‌రావు, ఉపేందర్‌బాబు, రామకృష్ణ, సుమలత, శివకేశవరావు, చిరంజీవి, శ్రావణ్‌కుమార్, మురళి, దేవదాస్, విజయ్‌సందీప్, అజయ్, వెంకటరమణ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ


విద్యార్థి సాయిశ్రీహిత్‌ను అభినందిస్తున్న త్రివేణి పాఠశాల యాజమాన్యం

కొత్తగూడెంరూరల్: ఇటీవల హైదరాబాద్‌లో ఆక్వాటిక్ ఫినామినా ఆధ్వర్యాన నిర్వహించిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో అండర్–15 విభాగం నుంచి పాల్గొన్న లక్ష్మీదేవిపల్లి మండలం త్రివేణి పాఠశాల 9వ తరగతి చదువుతున్న వి.సాయిశ్రీహిత్ ప్రతిభ కనబరిచాడు. పోటీల్లో ఆయన రెండో స్థానంలో నిలిచి రజత పతకం గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్రచౌదరి, గొల్లపూడి జగదీశ్, పీఆర్‌ఓ మురళీకృష్ణతో పాటు శ్రీనివాస్ సింగ్, వైవీ సురేశ్, సౌజన్య గురువారం అభినందించారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచ: ప్రస్తుతం రైతులు సాగు చేసుకుంటున్న పోడు భూములన్నింటికీ పట్టాలు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి కోరారు. పాల్వంచలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన జూలై 1న భద్రాచలంలో జరిగే ధర్నా కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. 2006 అటవీ హక్కుల చట్టాన్ని అనుసరించి సాగులో ఉన్న పోడు భూములు సర్వే చేసి, అర్హులకు పట్టాలివ్వాలని కోరారు. వలస ఆదివాసీలే కాక పోడు సాగు చేసుకుంటున్న గిరిజన, గిరిజనేతర పేదలంతా ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ముద్దా భిక్షం, అమర్లపూడి రాము, నూపా భాస్కర్, నిమ్మల రాంబాబు, నీలం భాస్కర్, పగిడిపల్లి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

వేతన వెతలు..

- ముస్సిపల్ కార్మికులకు చెల్లింపుల్లో అధికారుల నిర్లక్ష్యం
- ఇల్లెందులో బకాయిలు సుమారు రూ.2 కోట్లు
- ఆగ్రహంతో ఆందోళన బాట పట్టిన కార్మికులు
- పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్


ఉన్నతాధికారులతో చర్చిస్తున్న అధికారులు


మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ఇల్లెందు: పట్టణం నిద్ర లేవకముందే రహదారుల పైకి చేరుకుని శుభ్రం చేయడంతో పాటు డ్రెయినేజీల్లో చెత్త తొలగించడం.. ఇతర పనులు చేసే మున్సిపల్ కార్మికులకు వేతనాలతో పాటు అలవెన్సులు, ఇతర సదుపాయాలు కల్పించడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలున్నాయి. కార్మికుల శ్రమతో అవార్డులు దక్కుతున్నా అందుకు తగిన ప్రతిఫలితం అందక కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఇతర సౌకర్యాల మాటేమో కానీ నెలనెలా వేతనం కూడా రాక అప్పు పుట్టని పరిస్థితుల్లో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇల్లెందు మున్సిపాలిటీలో కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.2 కోట్ల మేర పేరుకుపోగా.. కమిషనర్లు మారినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆందోళన బాటపట్టారు. గురువారం తెల్లవారుజాము నుంచే మున్సిపల్ కార్యాలయం గేట్ ఎదుట బైఠాయించి మధ్యాహ్నం వరకు ఆందోళన కొనసాగించారు. అయితే అటు పోలీసులు రావటం, ఇటు కమిషనర్ యాదగిరి, చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు కొత్తగూడెంలో జరిగిన మంత్రుల పర్యటనకు వెళ్లడంతో ఆందోళన విరమించారు.

కార్యాలయం ముట్టడి

ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో వివిధ విభాగాల కార్మికులు 147 మంది ఉన్నారు. వీరికి సంబంధించి ఏళ్లుగా పీఎఫ్ కట్టని అధికారులు వేతనాల్లో కోత మాత్రం విధిస్తున్నారు. దీంతో ఎవరైనా పదవీ విరమణ చేసినా, మరణించినా వారి కుటుంబాలు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. గత 25 నెలలుగా పీఎఫ్ ఖాతాల్లో నగదు జమ చేయడం లేదని తెలుస్తోంది. ఇక రెండు నెలలుగా కార్మికులకు వేతనాలు విడుదల కావటం లేదు. నిధుల లేమితో ఇవ్వలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. ఒక్కో కార్మికుడికి సుమారు రూ.15,600 వరకు అందాల్సి ఉండగా.. ఆర్థిక సమస్యలు తట్టుకోలేక గురువారం ఆందోళనకు దిగారు. అయితే, పాలకవర్గం, కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో తాత్కాలికంగా ఆందోళన విరమించినా వేతనాలు, ఇతర బకాయిలు చెల్లించే వరకు పోరాటం ఆపేది లేదని కార్మికులు చెబుతున్నారు.

బకాయిలు ఇప్పించాలి..



ప్రజలు జబ్బుల బారిన పడకుండా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న మా వేతనాల సమస్యను మాత్రం పరిష్కరించటం లేదు. సక్రమంగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, పాలకవర్గం తక్షణం చొరవ చూపి వేతనాలు, ఇతర బకాయిలు ఇప్పించాలి.

–సంజీవ్, శానిటేషన్ కార్మికుడు, ఇల్లెందు

మూడు నెలలకోసారి ఇస్తే ఎలా..



మాకు రెండు, మూడు నెలలకు ఒకసారి వేతనాలు ఇస్తే కుటుంబ పోషణ ఎలా అన్నది అధికారులు ఆలోచించాలి. వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పిల్లల చదువులు, అనారోగ్యం పాలైతే చికిత్స కోసం చేతిలో డబ్బు లేక ఇబ్బంది పడుతున్నాం.

–వేమల గురునాథం, కాంట్రాక్ట్ కార్మికుడు

వేతనాలు ఇచ్చి ఆదుకోండి..



రెండు నెలల వేతనం, పీఆర్‌సీ బకాయిలు, ఎస్‌ఎంఆర్, రిక్షా కార్మికుల పీఎఫ్, కాంట్రాక్ట్ కార్మికులకు పీఎఫ్ జమా, బీమా సదుపాయం తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలి. మున్సిపల్ శానిటేషన్ వర్కర్లను నిర్లక్ష్యంగా చూడొద్దు. మా శ్రమతోనే పట్టణం పరిశుభ్రంగా ఉంటోందని గ్రహించాలి.

–జి.భూలక్ష్మి, ఎస్ఎంఆర్ వర్కర్

త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తాం



మున్సిపల్ కార్మికులకు వేతనాలు, ఇతర బకాయిలకు సంబంధించి సమస్యలను పరిష్కరిస్తాం. నిధులు తక్కువగా ఉండటంతో సమస్యలు వస్తున్నాయి. ఇప్పటికే చాలావరకు సమస్యలను పరిష్కరించగా, మిగతా వాటిపైనా దృష్టి సారిస్తాం. సమ్మెతో ఫలితం ఉండదని గుర్తించాలి.

–బి.యాదగిరి, మున్సిపల్ కమిషనర్

నేడు టేకులపల్లి సంత వేలం

టేకులపల్లి: టేకులపల్లి, గోలియాతండా గ్రామ పంచాయతీల సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించే సంత వేలాన్ని శుక్రవారం ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి ఎల్.కిరణ్ తెలిపారు. గతేడాది సంత వేలం రూ.11.81 లక్షలు పలకగా, ఈ నెల 13న నిర్వహించిన వేలంలో పాట రూ.6.80 లక్షల వద్దే నిలిచిపోయింది. దీంతో తిరిగి శుక్రవారం నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు ఉదయం 10.30 గంటల్లోగా రూ.50 వేల డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని సూచించారు.

వారపు సంత వేలం వాయిదా

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో వారపు సంత వేలంపాట వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో వారపు సంతకు వేలంపాట నిర్వహించగా, ఆఫ్‌సెట్ ప్రైజ్ దాటనందున వాయిదా వేసినట్లు కమిషనర్ తెలిపారు. ఇప్పటివరకు వారపు సంతకు రెండు సార్లు నిర్వహించిన వేలంపాటలో ఆఫ్‌సెట్‌ప్రైజ్ రాకపోవడంతో మున్సిపల్ కౌన్సిల్‌లో పెట్టి తీర్మానం చేసి కలెక్టర్‌కు పంపిస్తామని, అనంతరం కలెక్టర్ ఆదేశాల ప్రకారం నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాల్వంచ: టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో, ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాతీయ అధ్యక్షుడు ఎంఏ వజీర్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జెన్‌కోలో డైరెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉండటంతో ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చాలని, కారుణ్య నియామకాలు అమలు చేయాలని, అర్హులైన వారిని ఆర్టిజన్లుగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి డి.రాధాకృష్ణ, జెన్‌కో అధ్యక్షులు పి.రాము, కుమారస్వామి, నగేశ్, ప్రమోద్, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ఇల్లెందురూరల్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లోహిత


పాల్వంచరూరల్: ప్రదర్శన నిర్వహిస్తున్న అధికారులు, మహిళా సంఘాల బాధ్యులు

ఇల్లెందురూరల్: సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి లోహిత అన్నారు. మండలంలోని ముత్తారపుకట్ట గ్రామంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలందరినీ పరీక్షించి అవసరమైన వారికి ముందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను, అపరిశుభ్ర ప్రదేశాలను పరిశీలించి ప్రజలకు పలు సూచనలిచ్చారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సికిల్ సెల్ ఎనీమియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. పంచాయతీ కార్యదర్శి రాధిక, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాపై అప్రమత్తత అవసరం

పాల్వంచరూరల్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, సికిల్‌సెల్ ఎనీమియా విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని పాండురంగాపురంలో గురువారం సికిల్ సెల్ ఎనీమియాపై గ్రామ మహిళా సంఘం సభ్యులతో అధికారులు ప్రదర్శన నిర్వహించగా ఎంపీడీఓ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ బి.నారాయణ, ఏపీఎం రాంబాబు, ఏపీఓ పి.రంగా, సీసీ శ్రీను, కార్యదర్శులు కాళీ, సంధ్య పాల్గొన్నారు.

ఏఐటీయూసీ విజయకేతనం..


డైరెక్టర్లను అభినందిస్తున్న ఆర్‌సీహెచ్‌పీ హెచ్‌ఓడీ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌సీహెచ్‌పీ)లో గురువారం జరిగిన క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయం సాధించింది. సొసైటీలో మొత్తం 70 మంది ఓటర్లకు 67 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ మేరకు సీహెచ్‌పీలోని ఏడు డైరెక్టర్ పోస్టులకు గాను నాలుగింటిని ఏఐటీయూసీ గెలుచుకోగా, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, ఇండిపెండెంట్ ఒక్కోటి దక్కించుకున్నాయి. డైరెక్టర్లుగా గట్టయ్య, ఎం.సురేందర్, ఉర్సు శివదర్శన్, బాగం మురళి, పూర్ణచందర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, దుర్గాప్రసాద్ గెలిచారు. వారిని ఆర్‌సీహెచ్‌పీ హెచ్‌ఓడీ ఖరీముల్లా అభినందించారు. కాగా, ఓటర్లకు ఏఐటీయూసీ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి వి.మల్లికార్జున్‌తో పాటు వీరస్వామి, రాములు, సందెబోయిన శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలి..


సీఈకి వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

పాల్వంచ: రాష్ట్ర ప్రభుత్వం రామగుండంలో నిర్మించాలని భావిస్తున్న 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌ను సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కాకుండా టీజీ జెన్‌కో సంస్థ ఆధ్వర్యంలో నిర్మించాలని కేటీపీఎస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. పాల్వంచలో గురువారం జేఏసీ నాయకులు సమావేశమై చేసిన తీర్మానాన్ని కేటీపీఎస్ 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావుకు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఇప్పటికే పలుచోట్ల కాలం చెల్లి మూతబడుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యాన జెన్‌కో మనుగడ సాగించేలా కొత్త ప్లాంట్లను సంస్థ పరిధిలోనే నిర్మించాలని కోరారు. నాయకులు బి.మంగీలాల్, గిరిధర్, బ్రహ్మాజీ, మహేశ్, రమేశ్, మధుబాబు, రాధాకృష్ణ, రాజేందర్, ధనయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, నర్సింహారావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగం పెరిగిపోతోంది..


మాట్లాడుతున్న వి.అజయ్

ఇల్లెందు: ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు జూలై 13, 14 తేదీల్లో మధిరలో నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి వి.అజయ్ కోరారు. గురువారం ఇల్లెందు మాస్‌లైన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందని, యువతకు ఉపాధి మార్గాలు అడుగంటాయని, మత్తు, ధూమపానం, అశ్లీలం విలయతాండవం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువతను ఆదుకునేందుకు పాలకులు శ్రద్ధ చూపటం లేదని, ఈ తరుణంలో యువతరం తమ కర్తవ్యాలను అవగాహన చేసుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలని, ఇందుకు రాజకీయ శిక్షణ అవసరమని పేర్కొన్నారు. సమావేశంలో పీవైఎల్ జిల్లా నాయకులు బుచ్చిరాజు, సనప కుమార్, కొర్సా రామకృష్ణ, కాక వెంకటేశ్వర్లు, ధరావత్ దేవా, ఇస్లావత్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో దుస్తులు పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం రైటర్‌బస్తీలోని శ్రీసత్యసాయి ఆశ్రమంలో ఆదర్శ మహిళ సేవా సంఘం వ్యవస్థాపకురాలు కంచర్ల విమల ఆధ్వర్యంలో గురువారం దుస్తులు పంపిణీ చేశారు. ఆశ్రమంలో ఉంటున్న పిల్లలకు స్పోర్ట్స్ టీషర్టులు, బనియన్లు, టవళ్లు, వృద్ధులకు లుంగీలను పంపిణీ చేశారు. సేవా సంఘం ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సేవా సంఘం సభ్యులు బానోత్ లక్ష్మీనారాయణ, కొల్లు శ్రీను, చెరుకూరి శివ పార్వతి, గణేశ్ టెంపుల్ ఈఓ సులోచన, చిట్టూరి పార్వతి, తెల్లాకుల పద్మ పాల్గొన్నారు.

మారెమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

పాల్వంచరూరల్: మండలంలోని తోగ్గూడెం గ్రామంలో గురువారం మారెమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. వేద పండితులు, గ్రామ పెద్దల సమక్షంలో శాస్త్రోక్తంగా తంతునిర్వహించారు. ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శాంతి, అప్పారావు, సూర్యనారాయణ, జర్పుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత


నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

జూలూరుపాడు: జూలూరుపాడు గ్రామానికి చెందిన నిరుపేద అయిన యలబాక అనసూర్యమ్మకు గురువారం జేపీఆర్ ఫౌండేషన్ బాధ్యులు నిత్యావసర సరుకులు, ఇల్లు కురవకుండా నల్లపట్టా (పరదా)ను హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీనర్సయ్య చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో జేపీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఇడుపుల రాజు, తంబర్ల నరసింహారావు, ఎస్కే సమీర్, పాషా పాల్గొన్నారు.

3న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఇల్లెందురూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జూలై 3వ తేదీన ఎంపీపీ చీమల నాగరత్నమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ధన్‌సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి అధికారులు ఈ నెల 29వ తేదీనే తమ ప్రగతి నివేదికలను కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

అంబేడ్కర్‌కు డిప్యూటీ సీఎం నివాళులు


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అభ్యుదయ కళా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దెల శివకుమార్‌తో పాటు మందా హన్మంతు, కూసపాటి శ్రీనివాస్, పీక కృష్ణ, చంద్రగిరి గోపీచందర్ తదితరులు డిప్యూటీ సీఎంను సన్మానించారు. అలాగే, చుంచుపల్లి మండలంలోని రామంజనేయ కాలనీలో ఉంటున్న టీపీసీసీ సభ్యుడు జినుగు బాలశౌరి ఇంటికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెళ్లారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు. ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్ నాయక్, కూనంనేని సాంబశివరావు, నాయకులు పోట్ల నాగేశ్వరరావు తదితరులున్నారు.

డిప్యూటీ సీఎంకు వినతుల వెల్లువ

సూపర్‌బజార్(కొత్తగూడెం)/సింగరేణి(కొత్తగూడెం): జిల్లా పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలెక్టరేట్‌లో పలువురు కలిసి సమస్యలపై వినతిపత్రాలు అందించారు. తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ ఎస్టీ సంక్షేమ శాఖలో వర్కర్లను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అలాగే, సింగరేణిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు జీఓ 22 అమయ్యేలా చూడాలని కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షులు రాసూరి శంకర్ ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న సీడీపీఓ నిర్మలజ్యోతి

జూలూరుపాడు: అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, ఐసీడీఎస్ చండ్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ నిర్మలజ్యోతి అన్నారు. పడమటనర్సాపురం రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులను సీడీపీఓ నిర్మలజ్యోతి గురువారం ప్రారంభించి మాట్లాడారు. నూతన విద్యావిధానంలో భాగంగా ఎర్లీ చైల్డ్‌వుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ)పై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, గర్భిణులు, బాలింతల వివరాలను ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, గంగాజలం, నాగమణి, శకుంతల, పాపకొల్లు, కొమ్ముగూడెం సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రశ్నాపత్రం తెలుగులోనూ ముద్రించాలి

సింగరేణి(కొత్తగూడెం) సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 68 ఈపీ ఆపరేటర్(ఇంటర్నల్) పోస్టుల భర్తీకి ఇటీవల డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించగా, అర్హత సాధించిన వారికి ఈ నెల 30 రాత పరీక్ష నిర్వహించనున్నారు. అయితే, ప్రశ్నపత్రాన్ని ఇంగ్లిష్‌తో పాటు తెలుగులోనూ ముద్రించాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. తెలుగులో ముద్రించడం ద్వారా అభ్యర్థులకు ప్రయోజనం ఉంటుందని ఆయన తెలిపారు.

30న ఏఐకేఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు


టేకులపల్లిలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇల్లెందురూరల్: ఈ నెల 30న మహబూబాబాద్ పట్టణంలో నిర్వహించే ఏఐకేఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బానోత్ ఊక్లా పిలుపునిచ్చారు. మండలంలోని మిట్టపల్లి గ్రామంలో గురువారం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. రైతు సంక్షేమం విషయంలో పాలకులు చిన్నచూపు చూస్తున్నారన్నారు. రైతాంగం, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌లో చర్చించి భవిష్యత్ ఉద్యమాల నిర్వహణ కోసం ప్రణాళిక రూపొందిస్తామని వివరించారు. కార్యక్రమంలో పూనెం సమ్మయ్య, నరసయ్య, తెల్లం రమేశ్, కిన్నెర రామయ్య, సుక్కమ్మ, పూనెం సుజాత, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

టేకులపల్లి: మహబూబాబాద్‌లో ఈ నెల 30న ఏఐకేఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ నిర్వహించనుండగా.. గురువారం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ ఊక్లానాయక్, రాష్ట్ర నాయకుడు ఉప్పరబోయిన రామ్మూర్తి, పెనక రామస్వామి, మాలోత్ వసంతరావు, గుగులోత్ చందర్, భూక్య సమాన్, బాణోత్ భద్రు తదితరులు పాల్గొన్నారు.